సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 10 । మార్చి । 2023



సీహెచ్‌సీల్లో సిజేరియన్లు

సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీలు), ప్రాంతీయ ఆస్పత్రు(ఏరియా ఆస్పత్రులు)ల్లో ప్రసవాల సంఖ్య గతంలో కంటే బాగా పెరిగింది.

- 8లో



14 నుంచి మహిళలకు క్రీడలు

ఈ నెల 14 నుంచి మహిళలకు క్రీడలు నిర్వహించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య క్రీడా శిక్షకుడు ఎస్.వెంకటేశ్వర రావు తెలిపారు.

- 8లో

వాటర్‌షెడ్ ప్రాజెక్టులకు ప్రాధాన్యం



పార్వతీపురం: తక్కువ బడ్జెట్‌తో ఎక్కువ ఫలితాలు సాధించే వాటర్‌షెడ్ ప్రాజెక్టు నిర్మాణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. సుమారు 50 ఎకరాలకు నీరందించే వాటర్‌షెడ్ నిర్మాణాలకు అనువైన ప్రాజెక్టులను గుర్తించాలన్నారు.

న్యూస్‌రీల్

రాజీయే రాజమార్గం



ఆర్తాంలో నిర్వహించిన న్యాయఅవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ

కొమరాడ: వివాదాలతో కోర్టుచుట్టూ తిరిగి విలువైన సమయం, డబ్బు వృథా చేసుకోవడం కంటే రాజీయే రాజమార్గమని పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ అన్నారు. మండలంలోని ఆర్తాం గ్రామంలో మండల న్యాయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన న్యాయఅవగాహన సదుస్సులో ఆయన మాట్లాడారు. చిన్నచిన్న సమస్యలను గ్రామ, వార్డు పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో లాయర్ జోగారావు, కోర్టు కానిస్టేబుల్ ప్రసాద్ పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాలకు మొబైల్ సేవలు



మ్యాప్ ద్వారా మొబైల్ టవర్ల ఏర్పాటుపై చర్చిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు మొబైల్ సేవలు అందేలా చూడాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ కోరారు. కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ టెలికాం మంత్రిత్వశాఖ డైరెక్టర్(సెక్యూరిటీ) మనోజ్‌కుమార్‌తో గురువారం సెల్‌టవర్ల ఏర్పాటుపై చర్చించారు. జిల్లాలో మారుమూల ప్రాంతాలు, మొబైల్ సేవల అవసరాలను జిల్లా మ్యాప్ చూపిస్తూ వివరించారు. జిల్లాలో 182 టవర్లు మంజూరయ్యాయన్నారు. బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ సంస్థలు టవర్లు నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. మారుమూల ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటుతో కమ్యూనికేషన్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తాయని, ప్రజలకు బాహ్య ప్రపంచానికి అనుసంధానం ఏర్పడుతుందని పేర్కొన్నారు. సచివాలయాల ద్వారా వైద్య, ఆరోగ్య సేవలు అందుతాయన్నారు. మే చివరి నాటికి కనీసం 100 టవర్లు వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో టెలికాం అధికారులు పాల్గొన్నారు.

ఓటింగ్‌పై అవగాహన



పోలింగ్ అధికారులకు శిక్షణ ఇస్తున్న డీఆర్వో వెంకటరావు

పార్వతీపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికల్లో నిబంధనలు పక్కాగా అమలుచేయాలని, ఓటింగ్ విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ పోలింగ్ అధికారులను ఆదేశించారు. పోలింగ్, సహాయపోలింగ్ అధికారులకు కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్యాలెట్ బాక్సుల నిర్వహణను సంపూర్ణంగా తెలుసుకోవాలన్నారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభించి, సాయంత్రం 4 గంటలకు ముగించాలన్నారు. ముందుగా పోలింగ్ ఏజెంట్లు హాజరుకావాలని కోరారు. పోలింగ్ ఏజెంట్లకు అభ్యర్థి ఇచ్చిన లెటర్, వారి గుర్తింపుకార్డు సరిచూసుకోవాలని, పోలింగ్ కేంద్రంలో ఏజెంట్లు వారికి కేటాయించిన స్థానంలోనే ఉండాలని, అటు ఇటు తిరగకూడదన్నారు. ఓటర్లు పోలింగ్ సిబ్బంది అందజేసిన పెన్నుతోనే ఓటు వేయాలని సూచించారు. దృష్టిలోపం గల ఓటరు ఎవరైనా సహాయకులతో వస్తే, వారినుంచి డిక్లరేషన్ తీసుకొని అనుమతించాలన్నారు. డీఆర్వో జె.వెంకటరావు, పోలింగ్ అధికారులకు పోలింగ్ ప్రక్రియపై శిక్షణ ఇచ్చారు. బ్యాలెట్ బాక్సు వినియోగం, బ్యాలెట్ పేపర్ మడతపెట్టే విధానం, పోలింగ్ ప్రక్రియపై అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. శిక్షణ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

11 నుంచి 13 వరకు మద్యం దుకాణాలు బంద్

పార్వతీపురం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఈనెల 11 సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం పోలింగ్ ముగిసేవరకు పోలింగ్ జరిగే ప్రాంతాల్లో మద్యం షాపులను మూసివేయాలని కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ నిషాంత్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు అన్ని రిటైల్ అవుట్‌లెట్స్, బార్లు, కల్లు దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు.

బడి నిర్వహణకు నిధుల మూట

- పాఠశాలల అవసరాలు తీర్చేలా ఆర్థిక కేటాయింపులు
- పార్వతీపురం మన్యం జిల్లాకు రెండో విడతలో రూ.78.82 లక్షలు విడుదల
- ఈ నెలలో పాఠశాలల ఖాతాలకు జమకానున్న నిధులు
- పాఠశాలల అభివృద్ధికి మరింత దోహదం



నాడు-నేడులో అభివృద్ధి చెందిన కురపాం మండలంలోని లంకాజోడు ప్రభుత్వ పాఠశాల

పార్వతీపురంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోంది. నాడు-నేడు కింద కోట్లాదిరూపాయల ఖర్చుతో పాఠశాలలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతోంది. పిల్లలకు కావాల్సిన అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. సరస్వతీనిలయాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తోంది. పేదకుటుంబాల పిల్లల చదువుకు అండగా నిలుస్తోంది. జగన్న విద్యాకానుకలను సమకూర్చుతోంది. జగనన్నగోరుముద్ద కింద మెనూప్రకారం పోషకాహారాన్ని అందిస్తోంది. పాఠశాలల నిర్వహణ ఖర్చులకు క్రమం తప్పకుండా నిధులు విడుదల చేస్తోంది. 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి రెండోవిడత పాఠశాలల మెయింటెన్స్ గ్రాంటు విడుదలచేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

నిర్వహణ నిధుల కేటాయింపు ఇలా...

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు స్టేషనరీ కొనుగోలు, చాక్‌పీసులు, పేరెంట్ కమిటీ సమావేశాలు, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీరు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వంటి వాటిని ఈ గ్రాంటుతో సమకూర్చుకోవచ్చు. నిర్వహణ నిధులను విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేటాయిస్తోంది. 1 నుంచి 30 మంది విద్యార్థులు ఉంటే రూ. 10వేలు, 31 నుంచి 100 మంది విద్యార్థులుంటే రూ.25 వేలు, 101 నుంచి 250 వరకు విద్యార్థులుంటే రూ.50 వేలు, 251 నుంచి 1000 మంది విద్యార్థులుంటే రూ.75 వేల చొప్పున ఐదు విడతల్లో అందజేస్తోంది.

జిల్లాకు రూ.78.82 లక్షలు మంజూరు

జిల్లాలో రెండో విడతగా పార్వతీపురం మన్యం జిల్లాలో 1,699 పాఠశాలలకు గాను రూ. 78,82,000ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను ఆయా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఖాతాలకు జమచేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా గ్రాంటులను పాఠశాలల అభివృద్ధికి ఖర్చుచేయాలని సమగ్రశిక్ష అధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు అధికారులు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు జారీచేశారు.

జిల్లాలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలల సంఖ్య, నిధుల కేటాయింపు ఇలా...

విద్యార్థుల సంఖ్య	పాఠశాలలు	విడుదలైన నిధులు
1-30 మంది	931	రూ. 18,62,000
30-100 మంది	467	రూ. 23,35,000
100-250 మంది	168	రూ. 16,80,000
250-1000 మంది	131	రూ. 19,65,000
1000కి పైబడి...	2	రూ. 40,000

నిబంధనలకు అనుగుణంగా వినియోగించాలి



ప్రభుత్వం కేటాయించిన నిధులను నిబంధనలకు అనుగుణంగా సక్రమంగా వినియోగించాలి. విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలి. మరుగుదొడ్ల నిర్వహణకు సైతం నిధులు కేటాయిస్తోంది. ఖర్చుచేసిన నిధులకు సంబంధించిన బిల్లులను గడువులోగా సంబంధిత అధికారులకు సమర్పించాలి. ఇందులో ఎవరూ నిర్లక్ష్యం వహించొద్దు.

– ఎస్‌డీవీ రమణ, జిల్లా విద్యాశాఖాధికారి, సమగ్రశిక్ష ఏపీసీ, పార్వతీపురం మన్యం

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

- జేసీ ఒ.ఆనంద్



నవధాన్యాల విత్తనాలను పరిశీలిస్తున్న జేసీ ఆనంద్

పార్వతీపురం: ప్రకృతి వ్యవసాయం రైతుకు లాభదాయకమని, తక్కువ ఖర్చుతో ఆరోగ్యకర దిగుబడులు వస్తాయని జేసీ ఒ.ఆనంద్ తెలిపారు. పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో ఏపీ సీఎన్ఎఫ్ ద్వారా రైతులు సాగుచేస్తున్న పంటలను ఆయన గురువారం పరిశీలించారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంపు, ఉత్పత్తులకు తగిన మార్కెటింగ్, రబీలో పంటల సాగు, ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలను రైతులను అడిగితెలుసుకున్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే ద్రవజీవామృతం, బీజామృతం, విత్తన గుళికలు తయారీని జేసీకి ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయ సాగును గణనీయంగా పెంచాలన్నారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక పార్వతీపురం, కురుపాం, సాలూరు రైతు బజారుల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయానికి ప్రత్యేక ఏర్పాట్లుచేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అదనపు డీపీఎమ్ ధనంజయరావు, జిల్లా మార్కెటింగ్ అసోసియేట్ మంతిని మానస, జిల్లా కో ఆర్డినేటర్ ప్రసాద్, నరసింహ, సిబ్బంది అప్పలనాయుడు, శ్రీరాములు, స్వామినాయుడు, రమణమ్మ, రైతులు యాండ్రాపు చినరామినాయుడు, అనూరాధ, తవుడు, కమల తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా 'తోటపల్లి' ఆధునికీకరణ పనులు



తోటపల్లి ఎడమ కాలువలో ఎం.రాజపురం వద్ద జరుగుతున్న లైనింగ్ పనులు పరిశీలిస్తున్న డీఈఈ రవికుమార్, ఏఈ శంకరరావు

వీరఘట్టం: పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లా రైతుల ఆశలసౌధం తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని పాత ఆయకట్టు కాల్వల ఆధునికీకరణ పనులు శరవేగంగా సాతుగున్నాయి. ఎడమ కాలువలో వీరఘట్టం మండలం ఎం.రాజపురం 20వ కి.మీ వద్ద కాంక్రీట్ లైనింగ్ పనులను గురువారం చేపట్టారు. ఈ కాలువ శివారు 37వ కి.మీ వరకు లైనింగ్ పనులు పూర్తి చేసి ఈ ఏడాది ఖరీఫ్‌కు పూర్తి స్థాయిలో నీరందిస్తామని డీఈఈ దమలపాటి రవికుమార్ తెలిపారు. రూ.193 కోట్ల వ్యయంతో జరుగుతున్న పాత ఆయకట్టు కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనులను ఈ ఏడాది 50 శాతం వరకు పూర్తి చేసి వచ్చే ఏడాది శతశాతం పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని డీఈఈ తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు జూన్ చివరి వారం నీరు విడుదల చేసేలా పనులను వేగవంతం చేశామన్నారు. ఆయన వెంట ఏఈ బి.శంకరరావు ఉన్నారు.

పరిశోధనలతోనే ప్రగతి



'జైర్' మ్యాగ్‌జైన్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, ఎన్‌ఆర్‌డీసీ సీనియర్ రీజనల్ మేనేజర్

- జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య
- జాతీయ సాంకేతిక సదస్సు ప్రారంభం

విజయనగరం అర్బన్: కంప్యూటర్ సైన్స్ కోర్సులో పరిశోధనలే కీలకమని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం 'క్రెసెన్స్ 2కే23' పేరుతో రెండురోజుల పాటు నిర్వహించే జాతీయ సాంకేతిక సదస్సును ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న సాంకేతిక అంశం ప్రజాజీవనానికి అనుగుణంగా ఉండాలని, విద్యార్థులు ఆ దిశగా పరిశోధనలు చేయాలని పిలుపునిచ్చారు. ఎన్‌ఆర్‌డీసీ సీనియర్ రీజనల్ మేనేజర్ అండ్ హెడ్ డాక్టర్ బి.జయకుమార్‌సాహూ మాట్లాడుతూ కోర్సులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. సృజనాత్మక ఆలోచనలతో కూడిన పుస్తకాల ప్రాధాన్యం వివరించారు. 'జైర్' మ్యాగ్‌జైన్‌ను వీసీ ప్రొఫెసర్ వెంకట సుబ్బయ్య, విద్యార్థి వై.సాయిఆదిత్య రచించిన 'హ్యూమన్స్ ఆర్ డేంజర్స్ జోన్' అనే పుస్తకాన్ని జయకుమార్ సాహూ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, కంప్యూటర్ సైన్స్ విభాగధిపతి డాక్టర్ పి.అరుణకుమారి, ఫ్యాక్టరీ కోఆర్డినేటర్ ఆర్‌డీడీవీ శివరాం, స్టూడెంట్ కో ఆర్డినేటర్స్, రిజ్వాన్, జె.తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

కుక్కలదాడిలో జింకపిల్ల మృతి



కుక్కలదాడిలో మృతిచెందిన జింక పిల్లను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి, బీట్ ఆఫీసర్

సీతానగరం: మండలంలోని జోగింపేటలోని ఓ ప్రైవేటు రిసార్ట్ సమీపంలో 14 నెలల వయస్సు కలిగిన జింకపిల్లను కుక్కలు హతమార్చాయి. రేపటి వలస కొండనుంచి వచ్చిన జింకపిల్లపై కుక్కలు దాడిచేయడంతో మృతిచెందింది. స్థానికుల సమాచారం మేరకు అటవీశాఖ బీట్ ఆఫీసర్ మనోజ్ జింకపిల్లను పరిశీలించారు. మండల పశువైద్యాధికారి ఎస్.రామారావుతో పోస్టుమార్టం చేయించి ఖననం చేయించారు. ఇటీవల జోగింపేట బాలయోగి గురుకులంలో చొరబడిన జింకపిల్లపై కుక్కలు దాడి చేసి హతమార్చాయి. వారం రోజుల్లో రేపటివలస కొండపై జీవిస్తున్న రెండు జింకపిల్లలు మృతిచెందడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

పంటపొలాల్లో గజరాజులు



గవరమ్మపేట వద్ద వరి పంటలో ఉన్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి, నిమ్మలపాడు, బిత్రపాడు, వెంకటరాజపురం, గవరమ్మపేట గ్రామాలు, పరిసర ప్రాంతాల పంటపొలాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. గవరమ్మపేట పంట పొలాల్లో గురువారం ఉదయం సంచరించిన ఏనుగులు సాయంత్రానికి సుభద్రమ్మవలస వద్ద పామాయిల్, అరటి తోటలో తిష్టవేశాయి. తినడానికి అరటి, తాగడానికి నీరు ఉండడంతో ఈ ప్రాంతంలోనే ఏనుగులు జీవనం సాగిస్తున్నాయి. పంట పొలాలు పాడవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిసార్లు రోడ్లపైకి రావడంతో భయంభయంతో ప్రయాణాలు సాగిస్తున్నారు.

పశువులకు టీకా రక్షణ



పశువులకు గాలికుంటు వ్యాధినిరోధక టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

- గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తు చర్యలు
- జిల్లాలో మొదలైన వ్యాక్సినేషన్

పాలకొండ రూరల్: పాడిపశువుల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టిసారించింది. గాలికుంటువ్యాధి నివారణ టీకాలను విస్తృతంగా వేయించడంతో పాటు పశుపోషణపై పశుసంవర్ధకశాఖ అధికారులతో రైతులకు అవగాహన కల్పిస్తోంది. సీజనల్‌గా వచ్చే వ్యాధులు, నివారణ చర్యలను వివరిస్తోంది. గాలికుంటు వ్యాధి సోకితే పాలిచ్చే గేదెలు, ఆవుల్లో పాలఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది. ఒక్కోసారి వాటి పాదుగులపై కూడా బొబ్బలు ఏర్పడే అవకాశాలు ఉంటాయి. దీనివల్ల బ్యాక్టీరియా ఆశించి చీము కారుతూ ఇతర రోగాలు వ్యాపించే అవకాశం ఉంది. దేశవాళీ పశువుల కంటే సంకర జాతి పశువుల్లో వ్యాధిసోకే అవకాశం ఎక్కువ. ఈ వ్యాధి కలిగిన తల్లి పాలను తాగిన దూడలు మరణించే అవకాశం ఉంది. వ్యాధి నివారణకు వ్యాక్సినేషనే ఆయుధం. జిల్లాకు 2,33,550 డోసుల వ్యాక్సిన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. పశుసంవర్ధక శాఖ అధికారులు ఊరూరా తిరుగుతూ వ్యాక్సినేషన్ ప్రక్రియను ముమ్మరం చేశారు.

రైతులు సహకరించాలి



గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పశువులకు వేసేందుకు ఊరూరా వచ్చే వైద్య సిబ్బందికి రైతులు సహకరించాలి. జిల్లాలోని పశువులన్నింటికీ వ్యాధినిరోధక టీకాలు వేస్తాం. ప్రభుత్వం వ్యాక్సినేషన్ డోసులను కేటాయించింది.


– డాక్టర్ ఆరిక ఈశ్వరరావు, పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

జిల్లాలో వ్యాక్సినేషన్ ఇలా...

మండలం	ఆవులు	ఎద్దులు	గేదెలు
గరుగుబిల్లి	12,600	10,400	3,865
జియ్యమ్మవలస	15,780	13,100	3,021
గుమలక్ష్మీపురం	18,800	17,800	1476
కురుపాం	32,150	30,400	2,234
పాలకొండ	15,519	1285	4,250
వీరఘట్టం	12,684	9,950	4,050
పార్వతీపురం	20,532	17,600	2,812
కొమరాడ	16,085	13,600	580
సాలూరు	22,674	19,400	650
పాచిపెంట	23,051	19,600	1500
మక్కువ	13,087	11,150	1395
సీతంపేట	14,943	13,400	3,600
భామిని	11,391	9,300	2,250
సీతానగరం	17,142	14,500	2,067
బలిజిపేట	24,420	20,500	1984

సీతంరాజు సుధాకర్‌కు పట్టం కట్టండి

- డిప్యూటీ సీఎం రాజన్నదొర



మెంటాడలో విశ్రాంత తహసీల్దార్ సీతంరాజు సుధాకర్‌కు ఓటువేయాలని కోరుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, తదితరులు

మెంటాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖమంత్రి పీడిక రాజన్నదొర ఓటర్లను అభ్యర్థించారు. మెంటాడ మండల కేంద్రంలో గురువారం పట్టభద్రుల ఇంటింటికీ వెళ్లి సీతంరాజు సుధాకర్‌కు ఓటేయాలని కోరారు. అనంతరం పట్టభద్రుల ఓటర్లు, గృహసారథులతో సమావేశమయ్యారు. ముందుగా బ్యాలెట్ నమూనాను చూపించారు. ఓటు ఎలా వేయాలో వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి తొలిప్రాధాన్యమిస్తున్నారన్నారు. యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా మందుకు సాగుతున్నారని చెప్పారు. ఇటీవల విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్‌ద్వారా రూ.13లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ఆరు లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు నాంది పలికారన్నారు. సీతంరాజును గెలిపిస్తే ఉత్తరాంధ్ర మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేగిడి రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు సిరిశెట్టి నారాయణరావు, దంతులూరి చిన్నరాజు, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, గృహసారథుల కన్వీనర్ కనిమెరక త్రినాథరావు, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, లెంక రత్నాకర్, రెడ్డి రాజప్పలనాయుడు, నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షుడు కాపారపు పైడపునాయుడు, సారిక సురేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

డిప్యూటీ స్పీకర్ కోలగట్లను కలిసిన అవనాపు విక్రమ్



డిప్యూటీ స్పీకర్ కోలగట్లతో అవనాపు విక్రమ్

విజయనగరం: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు వైఎస్‌ఆర్‌సీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీర భద్రస్వామిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోలగట్లకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు సంకురభుక్త నాగేశ్వరరావు, ముని లక్ష్మణ్ రావు, ఎర్నింటి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్‌పై దర్యాప్తు



సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీవో చంద్రమ్మ

మక్కువ: మండలంలోని పనసభద్ర సచివాలయం వలంటీర్‌పై కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌డీవో చంద్రమ్మ గురువారం దర్యాప్తు నిర్వహించారు. గ్రామానికి చెందిన వలంటీర్ భవాని విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తహసీల్దార్, ఎస్సైపై దురుసుగా ప్రవర్తించారన్న విషయంపై గతంలో ఎంపీడీవోకు పలుమార్లు ఫిర్యాదులు రావడంతో, ఆమెకు మెమో జారీ చేశారు. అయినప్పటికీ పనితీరు మెరుగుపడకపోవడంతో వలంటీర్ విధుల నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో తనను అన్యాయంగా విధుల నుంచి తొలగించారంటూ వలంటీర్ భవాని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దర్యాప్తు నిర్వహించాలని డీఎల్‌డీవో చంద్రమ్మను కలెక్టర్ ఆదేశించడంతో, ఆమె పనసభద్ర సచివాలయానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తానని ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవకుమార్, తహసీల్దార్ సూర్యనారాయణ, ఎస్సై పైడిరాజు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

సాలూరు: మండలంలోని చీపురువలస సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సాలూరు రూరల్ ఎస్సై ప్రయోగమూర్తి గురువారం తెలిపారు. వారి దగ్గర నుంచి రూ.35,690, నాలుగు బైక్‌లు, ఐదు మొబైల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

14 నుంచి మహిళలకు క్రీడలు

పార్వతీపురం టౌన్: ఈ నెల 14 నుంచి మహిళలకు క్రీడలు నిర్వహించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య క్రీడా శిక్షకుడు ఎస్.వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ నిషాంత్ కుమార్ సూచనల మేరకు ప్రతి సంవత్సరం మార్చి 8వ తేదీన నిర్వహించాల్సిన మహిళా క్రీడలు కొన్ని కారణాల వల్ల 14న నిర్వహిస్తామన్నారు. కావున ఔత్సాహిక క్రీడామహిళలు గమనించి పాల్గొనాలని పిలుపునిచ్చారు. నిర్వహించనున్న క్రీడల వివరాలు ఇలా..

- 14, 15 తేదీల్లో వివిధ సంస్థల ద్వారా యోగా నిర్వహణ
- 16వ తేదీ మాస్ యోగా నిర్వహణ (ఆర్‌సీఎం స్కూల్, పార్వతీపురం)
- 17వ తేదీ బాడ్మింటన్ క్రీడా పోటీలు (ఇండోర్ స్టేడియం, పార్వతీపురం)
- 22వ తేదీ వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు
- 25వ తేదీ క్రీడా పరుగు, మహిళా క్రీడాకారిణులకు సన్మానం (ఆర్‌సీఎం స్కూల్, పార్వతీపురం)

ట్రిపుల్ రైడ్ చేస్తే శిక్ష తప్పదు

విజయనగరం క్రైమ్: ట్రిపుల్ రైడింగ్ చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐ హరిబాబునాయుడు పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గురువారం ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారికి కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రధాన కూడళ్లలో అత్యధిక వేగంతో ట్రిపుల్ రైడింగ్‌లు చేస్తున్న సంఘటనలు కనిపించాయన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టిసారించి ట్రాఫిక్ పోలీసులు ఎక్కడికక్కడ చలానాలు విధిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ లోవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు సంఘటనల్లో పలువురి మృతి

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదకర సంఘటనల్లో గురువారం పలువురు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలియజేసిన మేరకు ఆయా సంఘటనలు, మృతుల వివరాలు ఇలా ఉన్నాయి.



బావిలో ఉమ మృతదేహం

గుర్ల: మండలంలోని సొలిపిసోమరాజు పేటకు చెందిన గంటుమాని ఉమ(32) బావిలో తేలియాడింది. గుంటమాని ఉమ, భర్త రాములు మధ్య ఇటీవల తగాదాలు బాగా జరిగిన నేపథ్యంలో అవమానాలు భరించలేక గురువారం గ్రామానికి ఆనుకుని ఉన్న బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అయితే మృతురాలి తల్లిదండ్రులు మాత్రం తమ కుమార్తె ఉమను హత్య చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్ల ఎస్‌ఐ శిరీష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన సందీప్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీనివాస్

బైక్ అదుపుతప్పి యువకుడు..

గుర్ల: మండలంలోని చుక్కపేట జంక్షన్ వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా పడడంతో నెల్లిమర్ల పట్టణానికి చెందిన సిల్లా సోముశేఖర్ (30) అలియాస్ సందీప్ మృతి చెందాడు. నెల్లిమర్లకు చెందిన సందీప్‌తో పాటు స్నేహితులు రాము, పాలూరి గణేష్ ద్విచక్ర వాహనంపై గరివిడి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నెల్లిమర్ల వస్తుండగా చుక్కపేట వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో సందీప్ అక్కడికక్కడే మృతి చెందగా రాము, గణేష్‌లు గాయపడడంతో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. గుర్ల ఏఎస్సై రాజశేఖర్ పట్నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి..

విజయనగరం క్రైమ్: ద్వారపూడి గ్రామ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని గ్రామంలోని షరాబుల వీధికి చెందిన శెనగంశెట్టి తాతారావు (32) మృతి చెందినట్లు శ్రీకాకుళం జీఆర్‌పీ ఎస్సై తెలిపారు. తాను పెంచుకుంటున్న ఆవును వెతుక్కుంటూ తాతారావు వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

లారీ ఢీకొని విద్యార్థి..



మృతుడు పవన్ కుమార్

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలో పాలకొండ-వీరఘట్టం రహదారిలో గల గ్యాస్ గొడౌన్ సమీపంలో లారీ ఢీకొని సంతకవిటి మండలం కృష్ణయ్య వలసకు చెందిన దాసరి పవన్‌కుమార్ (20) మృతి చెందాడు. ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ పాలకొండలోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న పవన్‌కుమార్ గురువారం కళాశాలకు వెళ్లాడు. అయితే హాల్‌టికెట్ మరిచిపోవడంతో వసతి గృహానికి వెళ్లి తీసుకుని తిరిగి కళాశాలకు వస్తూ రహదారిపక్కన ఆగాడు. అదే సమయంలో మితిమీరిన వేగంతో వచ్చిన లారీ పవన్‌కుమార్‌ను బలంగా ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

గడ్డి మందు తాగేసిన వివాహిత..



మృతిచెందిన చిన్నమ్మడు

సంతకవిటి: మండలంలోని సోమన్నపేట గ్రామానికి చెందిన పాండ్రంకి చిన్నమ్మడు(52) గడ్డిమందు తాగి అస్వస్థలకు గురికవడంతో కుటుంబసభ్యులు శ్రీకాకుళంలోని జెమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి భర్త రామినాయుడు ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్సై జనార్దనరావు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

48 గంటల పాటు మద్యం దుకాణాలు బంద్

- ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ ఉత్తర్వులు



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: జిల్లాలో మార్చి 13వ తేదీన జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో డ్రై డేస్ ప్రకటిస్తూ కలెక్టర్ ఎ.సూర్యకుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచే మద్యం దుకాణాలను మూసివేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏపీ ఎక్సైజ్ చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం మార్చి 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 4 వరకు ఆయా ప్రాంతాల్లో మద్యం దుకాణాలు, డిపోలు, కల్లు దుకాణాలు, బార్లు మూసివేయాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకే డ్రై డేస్ ప్రకటించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

12, 13 తేదీల్లో లోకల్ హాలీడే

ఎమ్మెల్సీ ఎన్నికను పురస్కరించుకుని పోలింగ్ రోజు ఈ నెల 13న, పోలింగ్ ముందు రోజు 12న లోకల్ హాలీడేగా ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పోలింగ్ జరుగుతున్న 72 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఈ సెలవు వర్తిస్తుందని తెలిపారు. మిగిలిన కార్యాలయాల విధులు యథావిధిగా జరుగుతాయని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లకు ఓటు వేసేందుకు వీలుగా ఈ నెల 13న ప్రత్యేక సాధారణ సెలవును మంజూరు చేస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదాన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

- కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురంటౌన్: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం అగ్నిమాపక శాఖ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ నిషాంత్ కుమార్ ప్రారంభించి, రక్తదానం చేసిన విద్యార్థులు, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మరొకరి ప్రాణం కాపాడినవారవుతారని, దీనిని అర్థం చేసుకుని ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం ద్వారా బలహీన పడతామనే అపోహను వీడాలని, రక్తదానం చేయడం వల్ల మరింత ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని స్పష్టం చేశారు. వేసవిలో రక్తనిల్వలు తగ్గుతాయని దానిని దృష్టిలో పెట్టుకుని యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, దీని పై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. రక్తదాన శిబిరంలో అగ్నిమాపక సిబ్బంది, భాస్కర కాలేజ్ డిగ్రీ విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.వాగ్దేవి, డాక్టర్.హరిజగన్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

- బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

పార్వతీపురం టౌన్: అంగన్‌వాడీ కేంద్రాలలో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పార్వతీపురం, మన్యం జిల్లా కేంద్రంలోని 18, 19 వార్డు సమీకృత అంగన్‌వాడీ కేంద్రాలను పరిశలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించేందుకు వండిన ఆహార పదార్థాలను, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రీ స్కూల్ పిల్లలకు నేర్పుతున్న ఆటపాటలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను తనిఖీ చేసి పిల్లలకు పరిశుద్ధమైన, పోష్టికాహారాన్ని క్రమంతప్పకుండా సరఫరా చేయాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు న్యూట్రిషన్ కిట్లు, పాలు, గుడ్లు, సంపూర్ణ పోషకాహారం మెనూ ప్రకారం అందించడంతో పాటు వారికి ఇమ్యునైజేషన్, నెలవారీగా ఆరోగ్య తనిఖీలు చేస్తూ, అవసరమైన మందులు సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ విజయగౌరి, సీడీపీఓ శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు

- డీఐఓ జగన్మోహనరావు



గర్భిణులతో మాట్లాడుతున్న డీఐఓ జగన్మోహనరావు

పార్వతీపురం టౌన్: గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక బెలగాం చర్చివీధి పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్‌ఎంఏ) కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెలా గర్భిణుల ఆరోగ్య తనిఖీల కోసం ప్రత్యేకంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో గర్భిణులకు అవసరమైన అన్ని ఆరోగ్య తనిఖీలు, పరీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. క్రమం తప్పకుండా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, కాల్షియం మాత్రలు గర్భిణులు వేసుకోవాలని, అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆస్పత్రి ప్రసవాలు, సాధారణ ప్రసవాలు ఆరోగ్యదాయకమని, వేసవిరీత్యా తాగునీరు అందుబాటులో ఉంచుకుని ఎప్పటికప్పుడు తాగాలని, హైరిస్క్ గర్భిణులు మరింత జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వైద్యసిబ్బంది ఎప్పటికప్పుడు గర్భిణుల గృహ సందర్శన చేసి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని, ఏ చిన్న ఆరోగ్య సమస్య ఉన్నా వెంటనే వైద్యులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.బి.పవన్, డా.బి నిహారిక, సూపర్‌వైజర్లు పుష్ప, జయగౌడ్, వైద్యసిబ్బంది, ఆశ వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీల్లో సిజేరియన్లు

- ఘోషా ఆస్పత్రిపై తగ్గిన ఒత్తిడి



ఘోషా ఆస్పత్రిలో ప్రసవించిన మహిళలు

విజయనగరం ఫోర్ట్: సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీలు) ప్రాంతీయ ఆస్పత్రు(ఏరియా ఆస్పత్రులు)ల్లో ప్రసవాల సంఖ్య గతంలో కంటే బాగా పెరిగింది. గతంలో సాధారణ ప్రసవాలు కూడా చాలా తక్కువగా సీహెచ్‌సీల్లో జరిగేవి. కానీ ప్రస్తుతం సిజేరియన్లు కూడా అధికంగానే జరుగుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వం సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులను నిర్లక్ష్యం చేసింది. వైద్య సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించక పోవడంతో సేవలు అతంత మాత్రంగానే అందేవి. ప్రసవాలు నిర్వహించడానికి అవసరమైన గైనకాలజిస్టులు, మత్తు వైద్యులు పూర్తి స్థాయిలో ఉండేవారు కాదు. ప్రస్తుతం సీహెచ్‌సీల్లో వైద్యులను, సిబ్బందిని ప్రభుత్వం నియమించడంతో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుతున్నాయి.

జిల్లాలో 6 సీహెచ్‌సీ, 2 ఏరియా ఆస్పత్రులు

జిల్లాలో బొబ్బిలి, చీపురుపల్లి, బాడంగి, రాజాం, భోగాపురం, నెల్లిమర్ల సీహెచ్‌సీలు ఉన్నాయి. అలాగే ఎస్.కోట, గజపతినగరంలలో ప్రాంతీయ ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో ప్రస్తుతం సాధారణ ప్రసవాలతో పాటు సిజేరియన్లు జరుగుతున్నాయి. గతంలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీల నుంచి ఘోషాఆస్పత్రికి ఎక్కువగా గర్భిణులను సిజేరియన్ కోసం రిఫర్ చేసేవారు. ప్రస్తుతం సీహెచ్‌సీ స్థాయిలోనే సిజేరియన్లు చేస్తుండడంతో ఘోషాఆస్పత్రిపై ఒత్తిడి తగ్గింది.

2 నెలల్లో 645 ప్రసవాలు

జిల్లాలో ఉన్న సీహెచ్‌సీలు, ప్రాంతీయ ఆస్పత్రుల్లో జనవరి, ఫిబ్రవరి నెలల్లో 645 ప్రసవాలు జరిగాయి. వాటిలో సాధారణ ప్రసవాలు 405 కాగా సిజేరియన్లు 240 ఉన్నాయి. జనవరి నెలలో 229 సాధారణ, 134 సిజేరియన్లు జరిగాయి. ఫిబ్రవరిలో సాధారణ ప్రసవాలు 176, 106 సిజేరియన్లు జరిగాయి.

> **పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది**
> అన్ని సీహెచ్‌సీ, ప్రాంతీయ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలతో పాటు సిజేరియన్లు జరుగుతున్నాయి. అన్ని చోట్లా పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది ఉన్నారు. రిఫరల్స్ సంఖ్య గణనీయంగా తగ్గింది.
> డాక్టర్ బి.గౌరీశంకర్

ప్రజాభిప్రాయ సేకరణ రద్దు

విజయనగరం రూరల్: మెంటాడ మండలంలో చిన మేడపల్లి, దత్తిరాజేరు మండలం మర్రివలస గ్రామాల్లో మెస్సర్స్ రోహతి మైన్స్, మినరల్స్, మెస్సర్స్ తను శ్రీ మైన్స్, మినరల్స్‌కు కేటాయించిన భూముల్లో ఖనిజాల వెలికితీతపై నిర్దేశించిన ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ టి.సుదర్శనం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఈ నెల 10న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు ఈ నెల 9న ప్రకటన జారీ చేశామని, అయితే కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని, ప్రజలు గమనించాలని కోరారు.

లైంగికదాడి యత్నంపై కేసు నమోదు

రాజాం సిటీ: మండల పరిధిలోని వీఆర్‌అగ్రహారం గ్రామానికి చెందిన గెడ్డాపు మోహనరావుపై లైంగికదాడి యత్నం కేసు నమోదుచేశామని ఎస్సై పి.నీలావతి గురువారం తెలిపారు. ఈ మేరకు ఆయన తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లలితకు భర్తతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త కూలి పనుల నిమిత్తం రాజాం వెళ్తూ పోషిస్తున్నాడు. ఇదే అదునుగా ఇంట్లో ఒంటరిగా ఉన్న తనను పక్కింట్లో ఉంటున్న మోహనరావు నిత్యం వేధిస్తున్నాడని, ఈ విషయమై పలుమార్లు తన భర్త మందలించినప్పటికీ అతనిలో మార్పురాలేదని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ క్రమంలో ఈ నెల 8న ఇంట్లో ఒంటరిగా ఉన్న తన చేయిపట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు దాడిచేశాడని ఫిర్యాదులో వివరించింది. ఈ విషయం గమనించిన చుటుపక్కల వారు తన భర్తతో పాటు అత్తమామలకు సమాచారం అందించడంతో వారి సహాయంతో చికిత్స నిమిత్తం రాజాం సామాజిక ఆస్పత్రిలో చేరినట్లు బాధితురాలు బుధవారం రాత్రి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విజయగణపతికి ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో విజయగణపతికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చాణక్య ఆధ్వర్యంలో విజయగణపతికి స్నపనం, పంచామృతభిషేకాలు, అర్చన నిర్వహించారు. కార్యక్రమంలో రామనారాయణం ఆలయ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, ఆలయ మేనేజర్లు శ్రీనివాసరాజు, ఏవీ రమణ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట అలంకరణలో ముత్యాలమ్మ



ప్రత్యేక అలంకరణలో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారు

విజయనగరం టౌన్: స్థానిక కొత్తపేటలో కొలువైన ముత్యాలమ్మ తల్లి అమ్మవారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు విశిష్ట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త మద్దాల భాస్కరరావు ఆధ్వర్యంలో అమ్మవారికి శా స్త్రోక్తంగా పూజాధికాలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఘటాలను నిలిపారు. చిత్ర విచిత్ర వేషధారణలతో అమ్మవారి అనుపు ఉత్సవం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనారిటీ సంక్షేమానికి కృషి

- మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షురాలు ఆశాజాన్
- సిమ్స్ బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



సిమ్స్ చర్చి ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలతో ఆశాజాన్‌ను ఆశీర్వదిస్తున్న పాస్టర్లు

విజయనగరం టౌన్: క్రిస్టియన్ మైనారిటీ సంక్షేమానికి తన వంతు బాధ్యతగా పూర్తిస్థాయిలో కృషిచేస్తానని క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షురాలు మాకిరెడ్డి ఆశాజాన్ స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక సిమ్స్ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆమె పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా క్రైస్తవ కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు వారికి అండగా ఉండేందుకు కృషిచేస్తానని భరోసా ఇచ్చారు. దేవుని ఆశీస్సులు అందరిపైనా ఉండేలా ప్రతి ఒక్కరూ ప్రార్థనలు చేయాలని పిలుపునిచ్చారు. తనకు అవకాశమిచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో పాటూ ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్‌ఆర్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను క్రైస్తవ పట్టభద్రులందరూ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చర్చి బిషప్ కేజే.ఫిలోమాన్, మధుమనోహర్, కరుణ, జాన్ వెస్లీ, సునీల్, పిరిడి పాల్, మధు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం తహతహ



ఘనసర వద్ద తోట బయటకు వస్తున్న ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని మనుమకొండ వద్ద తిష్ఠ వేసిన 6 ఏనుగుల గుంపు, ఘనసర వద్ద మకాం పెట్టిన 4 ఏనుగులు గురువారం సాయంత్రం వేర్వేరుగా బయటకు వచ్చాయి. రెండు గుంపులు తాగునీరు కోసం తహతహ లాడుతున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. పగటి వాతావరణం చల్లబడగానే తోటలు విడిచి నీటి కోసం వంశధార నదీతీరానికి పయనమవుతున్నాయి. ఈ నీటి వేటలో దారిలోని పచ్చని పంటలను ఏనుగుల గుంపు తింటూ.. మట్టేస్తూ నాశనం చేస్తున్నాయి. కనిపించే వ్యవసాయ బోర్లు, పైపులు పీకి వాటిలోని నీటిని తాగుతున్నాయి. మనుమకొండ వద్ద ఉన్న ఆరు ఏనుగుల గుంపు గురువారం మూడు కిలోమీటర్ల దూరంలోని వంశధార నదికి వచ్చి నీరు తాగి వెనుదిరిగాయని రైతులు చెబుతున్నారు. ఘనసర వద్ద ఏనుగుల గుంపు కూడా తాగునీటి కోసం వెదుకులాట ఆరంభించింది.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹ 190